# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బదిలీ



## నూతన జిల్లా కలెక్టర్‌గా అంకిత్ నియామకం

**పాల్వంచ, ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నూతన కలెక్టర్ గా 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అంకిత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా విధులు నిర్వహిస్తున్న ఆయనను తాజా బదిలీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నియమించారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన జితేష్ వి. పాటిల్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో అంకిత్ బాధ్యతలు చేపట్టనున్నారు. అక్టోబర్ 2, 1991న జన్మించిన అంకిత్, బనారస్ హిందూ విశ్వవిద్యాలయ నుండి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బి.టెక్ పూర్తి చేశారు. పరిపాలనా వ్యవస్థలో వివిధ విభాగాల సమన్వయం, స్థానిక సంస్థల పనితీరుపై పర్యవేక్షణలో ఆయన కీలక పాత్ర పోషించారు. నూతనంగా నియమితులైన కలెక్టర్ అంకిత్ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 27 | ఫిబ్రవరి | 2026 ♦ పేజీలు : 6






3 లో..

- రామక్షేత్రంలో రాజీలేని పరిపాలన
- గిరిజనాభివృద్ధికి గట్టి పునాది
- పర్యాటకానికి ప్రాణం... గిరిజనానికి ఆధారం
- సంక్షోభంలో సైతం ముందుండిన నాయకత్వం
- జిల్లా అభివృద్ధికి జితేష్ దిశానిర్దేశం.

# సేవకు సలామ్...



రాముడు నడయాడిన పుణ్యభూమి భద్రాచలం... గోదావరి తీరాల సహజ సోయగం... అడవిని ఆరాధ్యంగా భావించే గిరిజన జీవన ప్రవంతి... ఈ మూడు రూపాలను అభివృద్ధి దిశగా సమన్వయం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కొత్త ఆవేశం, కొత్త ఆశలు నింపిన పరిపాలకుడు జితేష్ వి. పాటిల్. 2023 జూన్ 16న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, తక్కువ కాలంలోనే జిల్లా రూపురేఖలను మార్చి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు. బదిలీపై వెళ్తున్న ఈ సందర్భంలో ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ 'ప్రజా జ్యోతి' ప్రత్యేక కథనం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి







## బీజాపూర్ లో

# ఎన్ కౌంటర్

- ఇద్దరు మావోయిస్టుల మృతి
- మృతిచెందిన మావోయిస్టులపై పది లక్షల రివార్డ్
- ఆయుధాలు, సామాగ్రి స్వాధీనం

**చర్ల, ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నది ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే నిఘా సమాచారం మేరకు, ఉమ్మడి బృందం మావోయిస్టు ఆపరేషన్‌కు వెళ్లింది. ఆపరేషన్ సమయంలో గురువారం ఇంద్రావతి నది ప్రాంతంలో భద్రతా దళాలకు మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు లో ఇద్దరు యూనిఫాం ధరించిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు .డిఆర్ జి / బస్తర్ ఫైటర్స్ / ఎస్ టి ఎఫ్ / కోబ్రా / సి ఆర్ పీ ఎఫ్ బృందాలు ఈ ప్రాంతంలో సమగ్ర శోధన ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్. బీజాపూర్ జిల్లా, జంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైగుర్-దోడం ప్రాంతంలో భైరామ్‌గఢ్ ఏరియా కమిటీకి చెందిన సాయుధ

మిగతా 2 లో...

# మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం




**చర్ల, ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి):** ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో పోలీసుల విజయం సాధించారు. కుమురాడి ప్రాంతంలో ఏ డి పీ ఆపరేషన్ సమయంలో 53వ బెటాలియన్ ఐ టి బి పీ జవాన్లు మావోయిస్టుల భారీ నక్సల్ డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రణాళికాబద్ధంగా ఏ డి పీ ఆపరేషన్ నిర్వహించగా కుమురాడి ప్రాంతంలోని నక్సల్ రహస్య స్థావరం నుండి భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఆధునిక అధునాతన ఆయుధాలు /పేలుడు పదార్థాలు

మిగతా 2 లో...

## టమాటా ధరలు ఢమాల్...

# రైతు ఆశలు కుదేల్



2 లో..

- ఎగసిన దిగుబడి ... దిగజారిన ధరలు
- కిలో రూ.5కి పలుకుతున్న టమాటా ధర
- రవాణా, కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి
- ఉచితంగా పంచుతున్నా కొనుగోలుదారులు లేరు

ఎర్రగా మెరిసే టమాటా ఈ సీజన్‌లో రైతు కళ్లలో కన్నీటి బిందువుగా మారింది. ఒకప్పుడు ఆకాశాన్ని తాకిన ధరలు, ఇప్పుడు నేలచాటున పడిపోవడంతో జిల్లా వ్యాప్తంగా టమాటా సాగు చేసిన అన్నదాతలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. విస్తారంగా వచ్చిన దిగుబడి, ఒకేసారి మార్కెట్లకు చేరడంతో గిట్టుబాటు ధరలు కరువైపోయాయి. కిలోకు ఐదు రూపాయలకే పరిమితమైన ధరలు, రవాణా కూలీ ఖర్చులు కూడా రాలేని పరిస్థితి సృష్టించాయి. పండించిన పంటను అమ్ముకోలేక కొందరు రైతులు రోడ్ల పక్కనే పారబోసే దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టమాటా రైతుల కష్టాలు, మార్కెట్ వ్యవస్థలో లోపాలు, అవసరమైన ప్రభుత్వ జోక్యం పై 'ప్రజా జ్యోతి' ప్రత్యేక కథనం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం



(మొదటి పేజీ తరువాయి...)

వైద్య సామాగ్రి ఇతర రోజువారీ వినియోగ వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నారు. బుధవారం విశ్వసనీయ మూలం నుండి అందిన సమాచారం మేరకు, సి ఓ బి మండోడా, 53వ బెటాలియన్ ఐ టి బీ పీ పోలీస్ ఫోర్స్ జవాన్లు కుమురాడి గ్రామ అటవీ పర్వతం వైపు ఏరియా డామినెన్స్ పెట్రోలింగ్ (ఏ డి పీ ఓ పీ ఎస్ ) పార్టీకి బయలుదేరారు. ఈ సమయంలో, ఇంటెన్సివ్ సెర్చ్ ఆపరేషన్ సమయంలో, సైనికులు నక్సల్ రహస్య స్థావరంలో దాగి ఉన్న నక్సల్ డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. శోధన ఆపరేషన్ సమయంలో స్వాధీనం చేసుకున్న పదార్థాల వివరాలు ప్రైమా కార్డ్ – సుమారు 100 మీటర్లు , సేఫ్టీ ఫ్యూజ్ – 20 మీటర్లు , ఆరెంజ్ ఫ్యూజ్ – 20 మీటర్లు , సట్లీ బాంబ్ – సుమారు 35 కిలోలు , ఎరువుల పొడి (గోధుమ రంగు) – 38 కిలోలు , ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ – 18 కిలోలు , బొగ్గు – 2.5 కిలోలు , ఏ ఏం ఏం పౌచ్ – ఐదు, ఇంప్రూవైజ్డ్ రాకెట్ లాంచర్ – ఒకటి , రాకెట్ లాంచర్ సెల్ – 13, మోర్టార్ సెల్ (హెవీ) – 19 , మోర్టార్ సెల్ (లైట్) – 11, బి జి ఎల్ లాంచర్ (ఇంప్రూవైజ్డ్ – బిగ్) – ఒకటి , బి జి ఎల్ లాంచర్ (ఇంప్రూవైజ్డ్ – స్మాల్) – ఒకటి , బి జి ఎల్ కార్ట్రిడ్జ్ (మీడియం) – 8 , . BGL కార్ట్రిడ్జ్‌లు (చిన్నవి) – 15 . బి జి ఎల్ కార్ట్రిడ్జ్‌లు (పెద్దవి) – 12 . లాంగ్–రేంజ్ బి జి ఎల్ రౌండ్లు – 70 ముక్కలు షార్ట్–రేంజ్ బి జి ఎల్ రౌండ్లు – 55 ముక్కలు, ఇంప్రూవైజ్డ్ హ్యాండ్ గ్రెనేడ్లు – రెండు ముక్కలు వైద్య సామాగ్రి మందులను స్వాధీనం చేసుకున్నారు.ఈ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలను సమర్థవంతంగా నియంత్రించడానికి నిరంతర శోధన కార్యకలాపాలు జరుగుతున్నాయి అని అధికారులు అన్నారు.

## బీజాపూర్ లో ఎన్ కౌంటర్



(మొదటి పేజీ తరువాయి...)

మావోయిస్టు కేడర్లు ఉన్నట్లు నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, డి ఆర్ జి బృందం బుధవారం సాయంత్రం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించిందని జితేంద్ర కుమార్ యాదవ్ తెలియజేశారు. ఆపరేషన్ సమయంలో గురుదేవ ఉదయం 6 గంటల నుండి డి ఆర్ జి సిబ్బంది కి మావోయిస్టుల మధ్య నిరంతర ఎన్‌కౌంటరలు జరిగాయి అని కాల్పుల తర్వాత జరిగిన సెర్చ్ ఆపరేషన్‌లో, ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఇద్దరు యూనిఫాం మావోయిస్టు కేడర్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు అని అన్నారు . ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేడర్‌లను ప్రాథమికంగా ఈ క్రింది విధంగా గుర్తించారు ఏ సి ఏం హిచామి మద్దా, భైరామ్‌గఢ్ ఏరియా కమిటీ సభ్యుడు రివార్డు 5.00 లక్షలు ప్రకటించారు. ఏ సి ఏం మంకి పోడియం, భైరామ్‌గఢ్ ఏరియా కమిటీ సభ్యుడు రివార్డు 5.00 లక్షలు ప్రకటించారు. ఎన్‌కౌంటర్ స్థలం నుండి సామాగ్రి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఒక ఎస్ ఎల్ ఆర్ రైఫిల్, మూడు మ్యాగజైన్‌లు, 55 రౌండ్లు ,ఒక ఇన్సాస్ రైఫిల్, మూడు మ్యాగజైన్‌లు, 19 రౌండ్లు , ఒక 12 బోర్ గన్, రెండు సెల్స్ ,రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, రెండు కంట్రీ–మేడ్ హ్యాండ్ గ్రెనేడ్‌లు, డిటోనేటర్లు, స్కానర్ బ్యాటరీలు, మెకానిజమ్స్, మందులు, పౌచ్‌లు ఇతర నక్సల్ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలోని పోలీసులు భద్రతా దళాలు ప్రజల ప్రాణాలను ఆస్తులను రక్షించడానికి కట్టుబడి ఉన్నాయని అన్నారు. సమీప ప్రాంతాలలో డి ఆర్ జి , బస్తర్ ఫైటర్స్, ఎస్ టి ఎఫ్ , సి ఆర్ పీ ఎఫ్ , కోబ్రా ఇతర భద్రతా దళాలు నిరంతర శోధన కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి అని అన్నారు . ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, బస్తర్ రేంజ్, శ్రీ సుందర్‌రాజ్ పట్టలింగం మాజీ మావోయిస్టు కార్యకర్తలు బర్సే దేవ, రూపేష్, రాణిత, రాజ్‌మాన్, రాజు సలాం, దేవ్‌జీ, సంగ్రామ్, భూపతి, వెంకటేష్ మరియు ఇతర మావోయిస్టు కార్యకర్తల మాదిరిగానే, మిగిలిన క్రియాశీల కార్యకర్తలు హింస మార్గాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరడానికి తెలివైన నిర్ణయం తీసుకోవాలి అని ఆయుధాలు హింసలో పాల్గొనడంలో అర్థం లేదు అని ప్రభుత్వం క్షేత్రస్థాయి వాస్తవాలకు సున్నితంగా ప్రతిస్పందించేదిగా ఉంటుంది అని లొంగిపోయిన కార్యకర్తలతో సహా ప్రతి ఒక్కరికీ అర్థవంతమైన ప్రశాంతమైన జీవితాన్ని అందించడానికి కట్టుబడి ఉంది అని అన్నారు ..

# టమాటా ధరల ఢమాల్... రైతు ఆశల కుదేల్



- ఎగసిన దిగుబడి ... దిగజారిన ధరలు
- కిలో రూ.5కి పలుకుతున్న టమాటా ధర
- రవాణా, కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి
- ఉచితంగా పంచుతున్నా కొనుగోలుదారులు లేరు

**ఎర్రగా మెరిసే టమాటా ఈ సీజన్‌లో రైతు కళ్లలో కన్నీటి బిందువుగా మారింది. ఒకప్పుడు ఆకాశాన్ని తాకిన ధరలు, ఇప్పుడు నేలచాటున పడిపోవడంతో జిల్లా వ్యాప్తంగా టమాటా సాగు చేసిన అన్నదాతలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. విస్తారంగా వచ్చిన దిగుబడి, ఒకేసారి మార్కెట్లకు చేరడంతో గిట్టుబాటు ధరలు కరువైపోయాయి. కిలోకు ఐదు రూపాయలకే పరిమితమైన ధరలు, రవాణా కూలీ ఖర్చులు కూడా రాలేని పరిస్థితి సృష్టించాయి. పండించిన పంటను అమ్ముకోలేక కొందరు రైతులు రోడ్ల పక్కనే పారబోసే దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టమాటా రైతుల కష్టాలు, మార్కెట్ వ్యవస్థలో లోపాలు, అవసరమైన ప్రభుత్వ జోక్యం పై 'ప్రజాజ్యోతి' ప్రత్యేక కథనం.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

వంటింటి రారాజుగా పేరుగాంచిన టమాటా, ఈసారి రైతు జీవితంలో చేదు జ్ఞాపకంగా మారింది. ఒకప్పుడు కిలోకు భారీ ధర పలికి వినియోగదారుల జేబులకు భారంగా మారిన టమాటా, ఇప్పుడు రైతులే కొనేవారు దొరకక నిల్వల భారంతో నిట్టూరుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా విస్తారంగా వచ్చిన దిగుబడి మార్కెట్‌లో మిగులు సరుకుగా మారడంతో గిట్టుబాటు ధరలు కరువయ్యాయి.



### ఆలస్యమైన సాగు... ఒకేసారి దిగుబడి

ఈ ఏడాది వర్షాలు దీర్ఘకాలం కొనసాగడంతో ఖరీఫ్ పంటల అనంతరం చేపట్టే కూరగాయల సాగు ఆలస్యమైంది. అక్టోబర్, నవంబర్ వరకూ వర్షాలు పడటంతో జిల్లాలోని అనేక మండలాల్లో రైతులు దాదాపు ఒకే సమయంలో టమాటా నాట్లు వేశారు. తరువాత చలి తీవ్రత, మేఘావృత వాతావరణం కారణంగా పంట వేగంగా పక్వానికి చేరింది. ఫలితంగా భారీ మొత్తంలో టమాటాలు ఒకేసారి మార్కెట్లకు చేరి ధరలు కుప్పకూలాయి.

### కిలో రూ.5... క్రేట్ రూ.100!

ప్రస్తుతం హోల్సేల్ మార్కెట్లలో టమాటా కిలో ధర రూ.5 వరకు పడిపోయింది. 20–25 కిలోల క్రేట్ రూ.100 నుంచి రూ.130 మధ్యే పలుకుతోంది. వారసంతల్లో ఉదయం కొంత ధర లభించినా, సాయంత్రానికి కొనుగోలుదారులు లేక మరింత తక్కువ ధరకు అమ్మకాలు జరపాల్సి వస్తోంది. రవాణా, కూలీ ఖర్చులు కూడా తిరిగి రాకపోవడంతో రైతులు పెట్టుబడి కోల్పోతున్నారు. కొన్నిచోట్ల పంటను అమ్ముకోలేక రహదారుల పక్కనే పారబోసే దృశ్యాలు కనిపిస్తున్నాయి.

### సాగులో సత్తా... మార్కెటింగ్‌లో సంక్షోభం

సుజాతనగర్ మండలం జిల్లాలో టమాటా సాగుకు కేంద్రబిందువుగా నిలుస్తోంది. చుంచుపల్లి మండలం నిమ్మలగూడెంలో ఆధునిక పందిరి పద్ధతులతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. చంద్రుగొండ, దమ్మపేట, అశ్వారావుపేట మండలాలు ఉద్యానవన పంటల హబ్‌లుగా ఎదుగుతున్నాయి. గోదావరి తీర ప్రాంతాలైన బూర్గంపాడు, సారపాక పరిసరాల్లో పండే టమాటాకు సాధారణంగా మంచి మార్కెట్ ఉంటుంది. అయితే ఈసారి అధిక ఉత్పత్తి రైతులకు వరం కాక శాపంగా మారింది.

### ఉచితంగా పంచుతున్నా లాభం లేదు

యాసంగి కాలంలో ఇంటి అవసరాల కోసం పెరటి తోటల్లో సాగుచేసిన టమాటాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. అవసరానికి మించి వచ్చిన పంటను కొందరు రైతులు ఉచితంగా పంచుతుండటంతో డిమాండ్ మరింత తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు.

### ప్రభుత్వం జోక్యం అవసరం

ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. కనీస మద్దతు ధర, ప్రత్యేక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ప్రాసెసింగ్ యూనిట్ల ప్రోత్సాహం వంటి చర్యలు తీసుకుంటేనే రైతులకు ఉపశమనం లభిస్తుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

## కిష్టారం గ్రామస్థుల సమస్య పరిష్కారానికి కోరం సురేందర్ ముందడుగు.




**టేకులపల్లి,ఫిబ్రవరి26,ప్రజాజ్యోతి:** మండలంలోని కిష్టారం గ్రామం ప్రజల సమస్యలను లిఖిత పూర్వకంగా రాసి కే.ఓ.సి. పీ.ఓ కు గ్రామస్థులతో కలిసి గురువారం అందచేసిన ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, బొగ్గు రవాణాతో రైతుల పంట పొలాలు దుమ్ముతో దెబ్బతింటునాయని దీని వల్ల రైతులు నష్టపోతున్నారని, నీటి సమస్య వంటి పలు సమస్యలను పరిష్కరించి గ్రామస్థులను ఆదుకోవాలని పివో కు వినతి పత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన కే.ఓ.సి పివో వారి సమస్యలను పరిష్కరిస్థామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిష్టారం సర్పంచ్ కొర్స రామకృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సర్పంచ్ చైతన్య



**ములకలపల్లి, ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి:** పాత గంగారం గ్రామపంచాయతీ సర్పంచ్ చైతన్య గురువారం సెక్రటరీ సునీష్‌తో కలిసి పాత గంగారం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో బాలింతలు, గర్భిణీలు మరియు చిన్నారులకు అందిస్తున్న కోడిగుడ్లు, పాలు ప్యాకెట్లు, పప్పు, బియ్యం మరియు ఇతర తినుబండారాల నాణ్యతను పరిశీలించారు. పిల్లలు మరియు గర్భిణీలలో రక్తహీనత తగ్గించే విధంగా పోషకాహారాన్ని సమర్థవంతంగా వినియోగించాలని అక్కడ నిర్వహించిన సమావేశంలో అంగన్వాడీ టీచర్లకు సూచించారు. అలాగే చిన్నారులు ప్రీ–స్కూల్‌కు వెళ్లే ముందే ప్రాథమిక పదాలను స్పష్టంగా పలకగలిగేలా బోధన అందించాలని సూచించారు. లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తెలిపారు.





- రామక్షేత్రంలో రాజీలేని పరిపాలన
- గిరిజనాభివృద్ధికి గట్టి పునాది
- పర్యాటకానికి ప్రాణం... గిరిజనానికి ఆధారం
- సంక్షోభంలో సైతం ముందుండిన నాయకత్వం
- జిల్లా అభివృద్ధికి జితేష్ దిశానిర్దేశం.

# సేవకు సలామ్...



**రాముడు నడయాడిన పుణ్యభూమి భద్రాచలం... గోదావరి తీరాల సహజ సోయగం... అడవిని ఆరాధ్యంగా భావించే గిరిజన జీవన ప్రవంతి... ఈ మూడు రూపాలను అభివృద్ధి దిశగా సమన్వయం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కొత్త ఆవేశం, కొత్త ఆశలు నింపిన పరిపాలకుడు జితేష్ వి. పాటిల్. 2023 జూన్ 16న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, తక్కువ కాలంలోనే జిల్లా రూపురేఖలను మార్చి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు. బదిలీపై వెళ్తున్న ఈ సందర్భంలో ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ 'ప్రజా జ్యోతి' ప్రత్యేక కథనం.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

భద్రాచలాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రముగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఐటీడీఏ, పర్యాటక, అటవీ శాఖలతో సమన్వయం సాధించి గోదావరి తీరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. వెదురు, కలప వంటి సహజ వనరులతో నిర్మించిన విడిదిగృహాలు, గ్రామీణ శైలిలో భోజనశాల, సోలార్ దీపాలతో అలంకరించిన ప్రాంగణం ఇవి భద్రాచలానికి సరికొత్త ఆధ్యాత్మిక పర్యాటక రూపాన్ని అందించాయి. నగర జీవన ఒత్తిడికి దూరంగా ప్రకృతి ఒడిలో సేదతీరే వాతావరణాన్ని సృష్టించడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. ఇదే క్రమంలో గోదావరి నదికి హారతి కార్యక్రమాన్ని ప్రారంభించి భద్రాద్రి ఆధ్యాత్మిక శోభను మరింత పెంచారు. భక్తుల మనసులను కట్టిపడేసే ఈ కార్యక్రమం భద్రాచలానికి కొత్త ఆకర్షణగా మారింది.

### ››› గిరిజన గూడెంలో అభ్యున్నతి వెలుగులు

అడవినే ఆధారంగా జీవించే గిరిజన సమాజానికి ఆర్థిక బలం చేకూర్చడం ఆయన ప్రధాన ధ్యేయం. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ విస్తరించి, గిరిజన మ్యూజియాన్ని సంప్రదాయ జీవన విధానానికి ప్రతిబింబంగా తీర్చిదిద్దారు. సంప్రదాయ వంటకాలు, అటవీ ఉత్పత్తులు, చేతివృత్తుల ప్రదర్శనలు, విలువిద్య, బోటింగ్ వంటి వినోద కార్యక్రమాలు ఇవి అన్నీ గిరిజన ప్రాంతాలకు కొత్త ఉపాధి అవకాశాలను తెరచాయి. రాగి, జొన్న ఆధారిత ఆహార పదార్థాల ప్రోత్సాహం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చారు. అభివృద్ధి అంటే కేవలం కాంక్రీట్ కట్టడాలు కాదని, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణతో కూడిన ప్రగతే నిజమైన అభ్యున్నతి అని ఆయన చూపించారు.





### ››› గోదావరి వరదల్లో సేవా ధృక్పథం

గోదావరి ఉప్పొంగిన వేళల్లో జిల్లా ప్రజలు ఆందోళనలో ఉన్నప్పుడు, ఆయన పరిపాలన యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ముందుండి పర్యవేక్షించారు. సహాయక శిబిరాల ఏర్పాటు, పునరావాస చర్యలు, ఆహార–వైద్య సదుపాయాల కల్పనలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకుని ప్రాణనష్టాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించారు. సంక్షోభ సమయంలో సమర్థమైన సమన్వయం, సమయోచిత చర్యలతో ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు.

### ››› అవార్డులతో జాతీయ గుర్తింపు

జిల్లాలో అమలు చేసిన వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 'జల్ సంచయ్ జన భాగీదారి' కార్యక్రమంలో దక్షిణ మండలంలో అవార్డు సాధించి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సత్కారం అందుకోనున్నారు. రూ.25 లక్షల నజరానాతో కూడిన ఈ పురస్కారం జిల్లాకు గర్వకారణమైంది. అకాంక్షిత జిల్లాల అభివృద్ధి కార్యక్రమంలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాల రంగాల్లో వంద శాతం పురోగతికి కృషి చేశారు. గుండాల మండలంలో కీలక సూచికలు పూర్తి చేసి రాష్ట్రస్థాయి ప్రశంసలు అందుకున్నారు. నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు సహా ఏడాదిలో మూడు జాతీయ పురస్కారాలు అందుకోవడం ఆయన పరిపాలనా ప్రతిభకు నిదర్శనం.

### ››› ఎన్నికల్లో ప్రశాంత వాతావరణం


జిల్లాలో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో ఆయన పరిపాలన విశేష పాత్ర పోషించింది. చట్టసంరక్షణ చర్యలు, సమన్వయంతో కూడిన నిర్వహణ ద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూసి ప్రజాస్వామ్య ప్రక్రియను విజయవంతం చేశారు.

### ››› ప్రజల హృదయాల్లో నిలిచిన అధికారి

కేవలం కార్యాలయ పరిమితుల్లోనే కాకుండా మారుమూల పల్లెలకు చేరుకుని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న పరిపాలకుడు జితేష్ వి. పాటిల్. అధికారాన్ని ఆజ్ఞల వేదికగా కాకుండా సేవా సాధనంగా మలిచిన ఆయన, అభివృద్ధికి దిశానిర్దేశం చేసి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు. బదిలీపై వెళ్తున్న ఈ వేళ, "సేవకు సలామ్" అంటూ భద్రాద్రి ప్రజలు ఆయనకు వీడ్కోలు పలుకుతున్నారు. జిల్లా అభివృద్ధి పథంలో ఆయన వేసిన అడుగులు, వెలిగించిన ఆశలు, సృష్టించిన మార్పులు ఇవి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా ఉంటాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు

## కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందచేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి,ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి:** పేదింటి ఆడబిడ్డ పెళ్లి తల్లి తండ్రులకు భారం కాకుండా,వారికి కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించి పేదలను ఆదుకుంటునామాని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.ఇందిరమ్మ ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తునామాని, అంతే కాకుండా ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సుబిక్షంగా ఉన్నారని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా తెలియచేసారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్రం , మండల అధ్యక్షులు దేవా నాయక్ , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ ,ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు .

## కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన లక్కినేని , భూక్యా దళ్ సింగ్ నాయక్





**టేకులపల్లి , ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి):** ఖమ్మం భూదాన్ భూముల సమస్యలపై ప్రజల పక్షాన నిలబడతానని భరోసా ఇచ్చేందుకు ఖమ్మం వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె టి రామారావు ను మాజీ శాసనసభ సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు లక్కినేని సురేందర్ రావు, భూక్యా దళ్ సింగ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇల్లందు నియోజకవర్గం లోని పార్టీ పరిస్థితులు, రానున్న ఎన్నికల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించేలా కృషి చేయాలని కేటీఆర్ నాయకులకు సూచించారు. గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు.నేతలు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుం టుందని, నియోజకవర్గంలో పార్టీని మరింత బలపర్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు

## ప్రతి వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా





**ఇల్లందు, ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో నెల కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ఒక టవ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ విస్తృతంగా పర్యటించారు. సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య నేతృత్వంలో ఇల్లందు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభి వృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వార్డులో మంచినీరు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు వహించాలని సూచించారు. వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఆయా వార్డు కౌన్సిలర్లు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ సైదుమియా, నాయకులు మున్నా, మురళి, యాకుబ్ పాషా, ప్రవీణ్, మహేందర్ రెడ్డి, ఉపేందర్, కొండ పల్లి సంపత్, దళిత రత్న మేకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయునికి మేవా కమిటీ ఆర్థిక సాయం



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి26, (ప్రజా జ్యోతి):** మండలంలోని సారపాకకు చెందిన పాత్రికేయుడు వెంకట్ రెడ్డి గత కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గురువారం సారపాకకు చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవా) వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.6000 ఆర్థిక సాయం గా అందజేశారు. ఈ కార్యక్రమంలో మేవా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా, షేక్ జహీర్ పాష, కార్యవర్గ సభ్యులు అక్బర్, సోహెల్ పాషా, హఫీజ్, సైదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రమాణాలపై ఓహెచ్ఎస్ డాక్టర్లకు శిక్షణ



**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 26 – ప్రజాజ్యోతి:** అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రమాణాలను అనుసరించి కోల్ అనుబంధ సంస్థలలోని బొగ్గు గనులలో పని చేసే ఉద్యోగులకు కోల్ వర్కర్ నిమోకోనియోసిస్ నిర్ధారణ కోసం జరిపే చెస్ట్ రేడియోగ్రాఫ్ క్లాసిఫికేషన్ పై అవగాహన కల్పించుట కోసం గురువారం నాడు కొత్తగూడెం ఇల్లందు క్లబ్ నందు డిజిఎంఎస్(డైరక్టరేట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) సహకారముతో రెండవ జోనల్ వర్క్ షాప్ లో భాగముగా రెండు రోజుల పాటు ఓహెచ్ఎస్ డాక్టర్లకు నిర్వహించే వర్క్ షాప్ కార్యక్రమాన్ని ప్రారంబించారు. సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(ఈ&ఎం) ఎం.తిరుమల రావు, డిజిఎంఎస్ అడ్వైసర్ & రిటైర్డ్ డిఎంఎస్ డా. కౌశిక్ సర్కార్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భముగా డైరక్టర్లు మాట్లాడుతూ... మైనింగ్ ఇండస్ట్రీలలో పనిచేసే ఉద్యోగుల ఆరోగ్య భద్రత కొరకు సమయానుకులముగా ఉద్యోగులందరికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నామని, ఆ పరీక్షలను చేసే సమయం లో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ప్రమాణాలను కూడా పాటించాలని తెలిపారు. ముఖ్యముగా ఈ రెండు రోజులపాటు రెండవ జోనల్ వర్క్ షాప్ లో పరిశ్రమలలో వృత్తి ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడంపై జరిగే అవగాహన ఓహెచ్ఎస్ డాక్టర్లందరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఇంకా మెరుగైన విధముగా సింగరేణి వ్యాప్తముగా ఉద్యోగులకు పిఎంఈ పరీక్షలను నిర్వహించి ఉద్యోగులందరూ ఆరోగ్యం గా ఉండేలా తద్వారా ఆరోగ్యకర సింగరేణి గా మారేలాచూడాలని కోరారు. అనంతరం డిజిఎంఎస్ అడ్వైసర్ & రిటైర్డ్ డిఎంఎస్ డా. కౌశిక్ సర్కార్ మాట్లాడుతూ... అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వృత్తి ఆరోగ్య విధానాలను అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డిజిఎంఎస్ అడ్వైసర్ & రిటైర్డ్ డిఎంఎస్ డాక్టర్ కౌశిక్ సర్కార్ తో పాటు సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్, జిఎం (సేఫ్టీ) కే. సాయి బాబు, జిఎం(సేఫ్టీ) కేజిఎం రీజియన్ కృష్ణ గోపాల్ తివారీ, ఏసిఎంఓ ఎం.ఉష, ఓహెచ్ఎస్ డాక్టర్ పి. రమేష్ బాబు, సింగరేణి వ్యాప్తముగా గల సింగరేణి ఏరియా ఆసుపత్రుల, డిస్పెంసరిల హెచ్ఓడి డాక్టర్లు, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, ఈఎస్ఐసి, ఇతర సంస్థల నుండి వచ్చిన వైద్యులతో కలిపి మొత్తం 50 మంది డాక్టర్లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

## 81బెటాలియన్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం

- విద్యార్థులకు 24 సైకిళ్ళ పంపిణీ



**చర్ల, ఫిబ్రవరి 26 :(ప్రజా జ్యోతి ) :** తెలంగాణ – ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులోని భీమారం గ్రామంలో గల సిఆర్పిఎఫ్ 81 బేస్ క్యాంప్ వద్ద గురువారం జరిగిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో సెకండ్ ఇన్ కమాండెంట్ హిమాన్షు ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు సైకిల్స్ పంపిణీ చేసారు. రాంపురం, ఊట్లపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన 24 మంది విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి సైకిల్లను పంపిణీ చేసారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా హిమాన్షు ప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కొరకు సి ఆర్ పి ఎఫ్ పనిచేస్తోందని వెల్లడించారు. అభివృద్ధికి నోచుకోని మారుమూల అటవీప్రాంత గ్రామాలకు రహదారుల నిర్మాణం, పాఠశాలల ఏర్పాటు, త్రాగునీటి సరఫరా, సెల్ టవర్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్న విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేసారు. తమ సిబ్బంది ప్రాణాలను తెగించి విదులను నిర్వహిస్తూ గ్రామాల అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. ఆదివాసీలు చెడు వ్యవసనాలవైపు మరల వద్దని, అభివృద్ధి నిరోదకులైన మావోయిస్టులను దరిచేరనీయవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రాం, ఇన్ చార్జ్ అసిస్టెంట్ కమాండెంట్ పవన్ కుమార్, ఫార్మాసిస్ట్ సతీష్ కుమార్, ఇన్స్పెక్టర్స్ ముత్తు స్వామి, ఎడం వాల్య, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం సేవించి పట్టుబడిన కేసులో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష

- ఐదు వందల రూపాయలు



**టేకులపల్లి, ఫిబ్రవరి26, ప్రజాజ్యోతి :** మద్యం సేవించి ఆటో నడిపిన కేసులో ఇల్లందు పట్టణానికి చెందిన కట్టబోయిన ప్రవీణ్ కు ఇల్లందు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి. ఇంద్ర మూడు రోజుల సాధారణ జైలు శిక్ష, 500 రూపాయలు జరిమానా విధించినట్లు టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి ఆటో నడుపుతున్న కట్టబోయిన ప్రవీణ్ ను మద్యం సేవించి పట్టుకుని బ్రీత్ అనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నాడని రిపోర్టు రాగా అతడిని ఇల్లందు స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఇల్లందు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి. ఇంద్ర మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించడం జరిగింది ఎస్ఐ ఆలకుంట రాజేందర్ తెలిపారు. వాహనదారులు ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు. లో పట్టుబడితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు పడే ఆస్కారం కూడా ఉందని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదం ఏ తప్పు చేయని ఎదుటివారు, వారి కుటుంబానికి ఉండకుండా నష్టపోతారు అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి పోలీసు కానిస్టేబుల్, కోర్టు కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాలో 408 కేజీల గంజాయి పట్టివేత

**పాల్వంచ, ఫిబ్రవరి 26 ,ప్రజా జ్యోతి:** ధనార్జన ధ్యేయంగా గుట్టుచప్పుడుగా తరలిస్తున్న గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు గురువారం భారీగా గంజాయిని పట్టుకున్నారు, ఇందుకు సంబంధించిన వివరాలు చింతూరు నుంచి నాసిక్ కు అక్రమంగా ఒక కంటైనర్ లారీలో కొబ్బరి పీచు మాటున తరలిస్తున్న 408 కేజీల గంజాయిని చుంచుపల్లి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పి రోహిత్ రాజ్ తెలిపారు, పట్టుబడిన గంజాయి విలువ రూ 2.4కోట్ల విలువ ఉంటుందన్నారు, గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## అంగన్వాడీలో సామూహిక సిమంతం, అక్షరాభ్యాసాలు





**టేకులపల్లి, ఫిబ్రవరి26, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గల అంగన్వాడీ కేంద్రంలో గురువారం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. టేకులపల్లి సర్పంచ్ బోడా బాలు నాయక్ చిన్నారులకు అక్షరాభ్యాసాలు, గర్భిణీలకు ఒడి నింపి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పౌష్టికాహారం ఆవశ్యకతపై వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణిగా ఉన్న సమయం నుంచి బిడ్డ పుట్టేవరకు టీకాలు ఇవ్వడం, కాన్పు జరిగేంత వరకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు జీజ, ఐడీసీఎస్ సూపర్వైజర్ అనురాధ, అంగన్వాడీ టీచర్లు భద్రమ్మ, పద్మ, ఇందిరమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

# పాల్వంచ గుడిపాడులో పురుడు పోసుకున్న పురాతన ఆలయం

- గుడిపాడు లో వెల్లి విరిసిన ఆధ్యాత్మికత
- నల్ల సురేష్ రెడ్డి ఆధ్వ ర్యంలో అంగరంగ వైభ వంగా వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం
- గోవిందా నామస్మర ణతో మార్మోగిన పాల్వంచ పట్టణం
- ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన శ్రీలంక సుప్రీంకోర్టు
- న్యాయమూర్తి తూరాజ్ రాజాజీ
- ఎమ్మెల్యేలు పాయం రాందాస్ నాయక్
- మాజీ మంత్రి వనమా
- సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా
- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య









**పాల్వంచ ,ఫిబ్రవరి 26,ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని గుడిపాడు గ్రామంలో కాకతీయ కాలంనాటి మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయ పున ప్రతిష్ట కార్యక్రమం గురువారం వేద మంత్రోచ్చారణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శరకోపముని జీయర్ చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, శ్యామల గోపాలం ట్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్, ఆలయ నిర్మాణ కర్త నల్ల సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి తురాజ్ రాజాజీ ముఖ్యఅతిథిగా హాజరై వెంకటేశ్వర స్వామి వారికి ,వివిధ దేవతమూర్తులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అదేవిధంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు ఎస్.కె సాబీర్ పాషా, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, డిసిసిబి మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొని స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు, విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గురువారం ఉదయం నుండి మంగళ వాయిద్యాలు ,వేద పారాయణులు ,నిత్య హోమాలు, చతుస్తనార్చన, ప్రాణాధిదిశ, వాయున్యాస హోమాలు ,మహా పూర్ణాహుతి, పుణ్యాహవచనం లాంటి పూజ కార్యక్రమాలను ఆలయ ఈవో రజిని కుమారి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అదేవిధంగా విగ్రహ ప్రతిష్ట అనంతరం సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు , ఆలయ అర్చకులు వైభవ వేదంగా నిర్వహించారు, కళ్యాణ మహోత్సవానికి నల్ల సురేష్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు, అదేవిధంగా అన్నపురెడ్డిపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయము నుండి పట్టు వస్త్రాలు తలంబ్రాలు అందజేశారు, నల్ల సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి గురిపాడు గ్రామానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి దేవతామూర్తుల విగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు, భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని మౌలిక వసతులను కల్పించడం పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# పేదల ఉసురు పోసుకున్న కాంగ్రెస్

- పొనిశెట్టి వెంకటేశ్వర్లు



**పాల్వంచ ,ఫిబ్రవరి 26 ,ప్రజా జ్యోతి:** ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల గ్రామ సమీపంలో పేదల ఇళ్లపై ప్రభుత్వం చేపట్టిన దారుణ చర్యలను బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండించండి, వెలుగుమట్లలో పేదలపై జరిగిన దాడి విషయమై గురువారం పాల్వంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొని శెట్టి వెంకటేశ్వర్లు స్పందించి ఈ సంఘటనను ఉద్దేశించి మాట్లాడారు, ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల గ్రామ సమీపంలో సుమారు పది సంవత్సరాల క్రితం భూదాన్ భూముల్లో దాదాపు 800 పేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో అధికారులే ఇంటి నంబర్లు, కరెంటు మీటర్లు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం గుర్తించి సౌకర్యాలు కల్పించిన ఇళ్లను ఇప్పుడు అక్రమమని చెప్పడం దారుణం అని మండిపడ్డారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలాది మంది పోలీసులతో, రెవెన్యూ సిబ్బందితో ఒకసారి గా వెళ్లి జెసిబిలతో పేదల ఇళ్లు నేలమట్టం చేయడం హేయమైన చర్య అని అన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఉన్నారని కూడా పరిగణలోకి తీసుకోకుండా వందలాది కుటుంబాలను నడిరోడ్డుపైకి తోసేయడం అమానుషమని అన్నారు ,పదేళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను ఒక్కరోజులోనే కూల్చివేయడం పాలకుల నిర్దాక్షిణ్యానికి నిదర్శనమని అన్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ, దేవాదాయ, చెరువు భూములు ఆక్రమించిన పెద్దల పై మాత్రం చర్యలు తీసుకోకుండా, 80–100 గజాల్లో గుడిసె వేసుకున్న నిరుపేదలపై మాత్రమే బలప్రయోగం చేయడం దారుణం అన్నారు, ఎన్నికల ముందు “అభయ హస్తం” అంటూ పేదల ఓట్లు కోరిన కాంగ్రెస్, ఇప్పుడు “భస్మాసుర హస్తం”గా మారి అదే పేదల గూటిని కాల్చేస్తోందని, పేదల పరిరక్షణ పేరుతో రాజకీయాలు చేసే వామపక్ష పార్టీలు కూడా ఈ దారుణంపై మౌనంగా ఉండడం ప్రజలు గమనిస్తున్నారు అని అన్నారు.వెలుగుమట్లలో జరిగిన ఈ నిరంకుశ చర్యపై బీజేపీ మొదటి రోజు నుంచే బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి నిజమైన పేద కుటుంబానికి తక్షణ నష్టపరిహారం, ప్రత్యామ్నాయ స్థలాలు , గృహ నిర్మాణం కల్పించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.పేదల కన్నీళ్లు కార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారు.అని అన్నారు. లింగగిరి వెంకట్రామామయ్య,మాలోత్ ప్రశాంత్, శేఖర్,కొత్తపల్లి విజయ్,బానోత్ బాలాజీ,రాజా లు పాల్గొన్నారు.

# శ్రీరామనవమికి సిద్ధమవుతున్న స్వాగత ద్వారాలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి , ఫిబ్రవరి 26,ప్రజాజ్యోతి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో మార్చి 20 నుంచి ప్రారంభమయ్యే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణం ఉత్సవ వాతావరణంతో కళకళలాడుతోంది. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన స్వాగత ద్వారాలకు రంగులు వేయిస్తున్నారు. అగ్నిమాపక కేంద్రం సమీపంలోని స్వాగత ద్వారం, సారపాక ప్రవేశ ద్వారం వద్ద రంగుల పనులు కొనసాగుతున్నాయి.మిథిలా క్రీడా ప్రాంగణంలోని కల్యాణ మండపానికి కూడా రంగులు వేయిస్తున్నారు. తొలి రోజు కల్యాణ మండపం శిఖర భాగానికి రంగులు వేసే పనులు చేపట్టారు. అలాగే ప్రధాన వీధుల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యుద్దీపాల అలంకరణకు చర్యలు తీసుకుంటున్నారు.శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం వంటి ప్రధాన కార్యక్రమాలకు వేలాదిమంది భక్తులు హాజరుకానుండటంతో తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేస్తున్నామని దేవస్థానం వర్గాలు తెలిపారు.



# పేదల కళ సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ ఇండ్లతో లబ్ధిదారులల్లో సంతోషం: ఎమ్మెల్యే



**ఇల్లందు, ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి:** పేదల కళ సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల వల్ల లబ్ధిదారులల్లో సంతోషం వ్యక్తమవుతుందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వం మాటలతో కాలయాపన చేయకుండా చేతల్లో ప్రతి ఒక్క హామీని చేసి చూపించడం జరుగుతుందన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మరో మూ డు దఫాలు ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందజేయ డం జరుగుతుందని తెలిపారు. అనంతరం రాచకొండ సత్యవతి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మెన్ పెండేల రాజు, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, కౌన్సిలర్లు పాబోలు స్వాతి, సైదుమియా, అజ్మీర వంశీ, రాధ కమల్ కోరి, గొపగాని రాజు, రేఖ స్వరూప రవిశంకర్, గందె పద్మ సదానందం, మెరుగు కార్తీక్, రంప రమ్య జాన్సన్, నీరుడు ఉపేంద్ర శీవలాల్, సోనిభాయ్ సుదర్శన్ కోరి, యండి జాఫర్, నీలపు రమేష్, కొర్లపాటి కిరణ్, సిహెచ్ శృతి రమేష్, స్థానిక నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పందిళ్ళ వెంకటేశ్వర్లు, మేకల మల్లేష్ యాదవ్, పల్లెర్ల చంద్రశేఖర్, గంజి శంకర్, జగన్నాథం, కిరణ్ పాల్గొన్నారు.

# వరుస విజయాలతో సెమీ ఫైనల్లో ఎస్సీసీఎల్




**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 26 – ప్రజాజ్యోతి:** కోల్ ఇండియా లిమిటెడ్ ఇంటర్ కంపెనీ క్రికెట్ టోర్నమెంట్ లో వరుస విజయాలతో దూసుకుపోతున్న సింగరేణి క్రికెట్ టీమ్, మూడు విజయలతో నేరుగా సెమిఫైనల్ అడుగుపెట్టింది. కెప్టెన్ నాగమోహన్ సారథ్యంలోని సింగరేణి జట్టు కోల్ ఇండియా క్రికెట్ పోటీల్లో విజయపరంపర కొన సాగిస్తున్నది. సింగరేణి జట్టు తన మూడవ లీగ్ మ్యాచ్ ఎస్ఈసీఎల్ జట్టు పై 14 పరుగుల తేడాతో విజయం సాధించి సెమిఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. మొదట బాటింగ్ చేసిన సింగరేణి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసి ప్రత్యర్థి జట్టుకు సవాలు విసిరింది. ఎస్సీసీఎల్ పరుగుల వేటలో 145 పరుగులకు చతికిలబడింది. జట్టులో బిరాజు ఒక్కడే పోరాడి 60 పరుగులు సాధించడం విశేషం.

**హరికిషన్ ఆల్ రౌండ్ ప్రతిభ – ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్**

ఎస్సీసీఎల్ ఆటగాడు హరికిషన్ యాదవ్ 13 పరుగులు చేయడమే కాకుండా బౌలింగ్ లో 20 పరుగులిచ్చి కీలకమైన 3 వికెట్లు తీసుకుని ఎస్సీసీఎల్ విజయంలో ముఖ్య భూమిక పోషించాడు.మరో బౌలర్ తులసి రామ్ సైతం 3 వికెట్లు పడగొట్టాడు. మొదట బ్యాటింగ్ చేసిన సింగరేణి జట్టు స్పెషలిస్ట్ బ్యాటర్ శ్రీనివాస్ అద్భుతంగా రాణించి 51 పరుగులు సాధించాడు. ఓపెనింగ్ స్టైలిష్ బ్యాటర్ శశి కాంత్ 33 పరుగులు మరో డాషింగ్ బ్యాటర్ శశ్వంత్ 32 పరుగులు చేయడంతో సింగరేణి జట్టు 159 పరుగుల తో పటిష్ట స్థితికి చేరుకుంది.

**అద్భుత ఆల్ రౌండర్ లతో సింగరేణి టీమ్**

టోర్నమెంట్ ఆసాంతం సింగరేణి ఆల్ రౌండర్ లు అద్భుతంగా రాణిస్తున్నారు. సీనియర్ ఆల్ రౌండర్ లెనిన్ బాబు, యుగంధర్, హరికిషన్లతో సింగరేణి జట్టు అద్భుతంగా ఉన్నది.బ్యాటింగ్ కు వెన్నుముకగా కెప్టెన్ నాగ మోహన్,సంపత్, సాయి రాకేష్ నిలబడటం జట్టుకు కలిసి వచ్చే అంశాలు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్‌గా అంకిత్ ఐఏఎస్ పదవీ బాధ్యతలు స్వీకరణ





**పాల్వంచ ,ఫిబ్రవరి 26,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా అంకిత్ ఐఏఎస్ గురువారం సాయంత్రం ఐడీఓసి కార్యాలయం లోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిఎండి జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను నూతన కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత, ప్రజాహితం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు .జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు భద్రాచలం పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్‌ను ఇల్లందు క్రాస్ రోడ్‌లో గల సింగరేణి గెస్ట్ హౌస్ వద్ద కొత్తగూడెం ఆర్డీవో మధు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఐడీఓసి కార్యాలయానికి చేరుకుని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన దండు సారయ్య



**ఇల్లందు, ఫిబ్రవరి 26, ప్రజా జ్యోతి:** ఖమ్మం భూధాన్ భూమి ప్రజల పక్షాన నేనున్నానని భరోసా ఇవ్వడానికి గురువారం ఖమ్మం వచ్చిన మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 13వ వార్డు నుండి దండు సారయ్య విజయం సాధించడం జరిగిందని కేటీఆర్ కు తెలిపారు. వార్డు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కేటీఆర్ సూచించారు.

# కీలక ఖనిజరంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం

- ప్రభుత్వ, ప్రైవేటు ఖనిజ పరిశ్రమలు కలిసి పనిచేస్తే మనదే అగ్రస్థానం
- కీలక ఖనిజ రంగ అభివృద్ధికి తన వంతుగా సింగరేణి కృషి






**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 26 – ప్రజాజ్యోతి:**
నేటి ఆధునిక ప్రపంచంలో కీలక ఖనిజాలకు అధిక ప్రాధాన్యత ఉందని, కీలక ఖనిజ రంగంలో భారత్ ను స్వయం సమృద్ధి దేశంగా రూపుదిద్దడానికి దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కమిటీ అభిప్రాయపడింది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం (ఫిబ్రవరి 26) కమిటీ చైర్మన్ డాక్టర్ డీకే. సింగ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో భారతదేశంలో కీలక ఖనిజాల ఆవశ్యకత, లభ్యత, కీలక ఖనిజాల అన్వేషణ,అందుకు గల అవకాశాలు, వివిధ ప్రభుత్వ మైనింగ్ సంస్థలు తీసుకోవలసిన చొరవ, బాధ్యతలు తదితర అంశాల పైన లోతుగా చర్చించారు. కమిటీ మెంబర్ సెక్రటరీ, నీతి ఆయోగ్, డిప్యూటీ అడ్వైజర్ మినరల్స్ శ్రీ ఆర్. శరవణభవన్, సభ్యులుగా ఉన్న సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఇంకా ఇతర సభ్యులు పాల్గొన్నారు. కేంద్ర నీతి ఆయోగ్ కమిటీ వారు ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సింగరేణి సంస్థ చైర్మన్ కూడా సభ్యులుగా ఉన్నారు. కనుక ఈసారి ఈ సమావేశాన్ని సింగరేణి ఆతిథ్యంలో నిర్వహించడం జరిగింది. సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సమావేశానికి స్వాగతం పలుకుతూ దేశంలో గల ప్రాథమిక మరియు ద్వితీయ కీలక ఖనిజ వనరులను కనుగొనడానికి ఏర్పాటు చేసిన ఈ కమిటీ దేశ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో తమ వంతు కృషి చేస్తుందని దీనికి సింగరేణి సంస్థ తన సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్, బాటమ్ యాష్ లలో దాగి ఉన్న క్రిటికల్ మినరల్స్ ను వెలికితీయడానికి తమ వంతు కృషి చేస్తామని, జాతీయ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు, బ్యాటరీలతో నడిచే వాహనాలు, ఎలక్ట్రానిక్ రంగ విస్తరణ లో, రక్షణ రంగంలో కీలక ఖనిజాల అవసరం ఎంతో ఉందని, దేశంలో కీలక ఖనిజాల వనరులు ఉన్నప్పటికీ, వాటి మైనింగ్ జరగటం లేదని కాబట్టి ప్రస్తుతం విదేశాల నుండి కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నామని కమిటీ అభిప్రాయపడింది. రానున్న కాలంలో కీలక ఖనిజాల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది కనుక దేశంలో గల కీలక ఖనిజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి ప్రభుత్వ మైనింగ్ సంస్థలు, ప్రైవేటు మైనింగ్ సంస్థలు కలిసి నడవాలని సూచించింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు సింగరేణి సంస్థ నుండి డైరెక్టర్ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, జీఎం(కోఆర్డినేషన్, మార్కెటింగ్) శ్రీ టి.శ్రీనివాస్, జీఎం(ఎక్స్ప్లోరేషన్) శ్రీ బి.శ్రీనివాసరావు, ఐఎంఎంటీ, కోల్ ఇండియా, సీఎస్ఐఆర్–సీఈసీఆర్ఐ(కరైకుడి), గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పోరేషన్, అదానీ, వేదాంత, లాయిడ్ మెటల్స్, హిందాల్కో, హిందుస్తాన్ జింక్, సన్ టెక్నాలజీస్ (చెన్నై) తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వైభవంగా నిర్వహణ

- బంజారా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- సేవాలాల్ మహారాజ్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకం







**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 26, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో గురువారం బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా భోగ్ బండార్ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన బంజారా మహోత్సవంలో పెద్ద సంఖ్యలో బంజారా సోదర సోదరీమణులు పాల్గొని ఉత్సవాలకు శోభ చేకూర్చారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన మహిళలు, యువతులు జానపద నృత్యాలు ప్రదర్శించగా, ఎమ్మెల్యే కూడా వారితో కలిసి నృత్యాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శి అని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యతా భావం, నైతిక విలువలు, సన్మార్గ జీవనానికి ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. బంజారా సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.విద్య, ఉపాధి రంగాల్లో బంజారా యువత ముందంజలో ఉండేలా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బంజారా మహోత్సవాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు.అనంతరం బంజారా నాయకులు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మూఢనమ్మకాలు, వ్యసనాలకు దూరంగా ఉండి స్వచ్ఛమైన జీవనం గడపాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జగధీశ్వరి, దమ్మపేట తహసీల్దార్ కొప్పుల రాంనరేశ్, ఆర్.ఐ వెంకటేశ్వరరావు, జీపీఓ రెడ్డిమాళ్ళ శ్రీను, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎస్.ఐ విజయ్ సింహరెడ్డి, సర్పంచ్ లకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, శివాలయ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు, మల్లెల నర్సింహారావుతో పాటు కాంగ్రెస్ నాయకుడు పర్సా వెంకట్ మరియు ఇతర నాయకులు, బంజారా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.